# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ ఆర్థికాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.**

2. **సమాజంలో పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమం దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

4. **రాష్ట్రాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ తెలిపారు.**

5. **ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం.**

==========================

దేశ ఆర్థికాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్లోని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం, పెదబల్లి గ్రామంలో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి నిన్న పాల్గొన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించేలా పంటలకు ఒక సమీకృత వ్యవస్థను ఏర్పాటు చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకారం అందిస్తామని ఈ సందర్భంగాకేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం–పీ4 కార్యక్రమంలో ఎక్కువ మందిని భాగస్వాములను చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పీ4 – జీరో పావర్టీ కార్యక్రమంపై గత సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆగస్టు 15వ తేదీ నాటికి ఒక లక్ష మంది మార్గదర్శులను గుర్తించేలా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుందని తెలిపారు.. మార్గదర్శులుగా ఉండేవారిని ప్రోత్సహించడానికి స్వయంగా వారితో సమావేశం కానున్నామని చెప్పారు. సమాజంలో పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమం దోహదపడుతుందని ముఖ్యమంత్రి వివరించారు

---------------------------

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిన్న సమావేశమైన మంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఆ సమావేశ నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాత్రికేయులకు వివరించారు. కొత్తగా 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వనున్నామని చెప్పారు. జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని మంత్రివర్గం తీర్మానించిందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 33 సెకన్లు

అలాగే తెలంగాణలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణకు సమగ్ర విధాన పత్రం, రెండు ప్రైవేటు విద్యాసంస్థలకు యూనివర్సిటీ హోదా వంటి అంశాలను మంత్రివర్గం ఆమోదించిందని శ్రీనివాస రెడ్డి తెలిపారు.

---------------------------

రాష్ట్రాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ తెలిపారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా భాధ్యతలు చేపట్టిన తర్వాత కాకినాడ జిల్లాలో నిన్న పర్యటించిన ఆయన, స్థానిక బిజెపి నాయకులతో సమావేశమైయ్యారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వ చేస్తున్న కృషిని వివరించారు. పార్టీకి సంబంధించిన అంశాలతో పాటు ఎన్డీఏ కూటమి అంశాలు రాష్ట్రంలో అమలు చేసేందుకు కృషి చేస్తానని మాధవ్ తెలుపుతూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న జనాభా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన అంశాలపై ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. 1987 జులై 11వ తేదీన జన్మించిన శిశువుతో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకుంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. "న్యాయమైన, ఆశాజనకమైన ప్రపంచంలో వారు కోరుకునే కుటుంబాలను సృష్టించడానికి యువతకు సాధికారత కల్పించడం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2050వ సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా భారీగా పెరిగే అవకాశం ఉన్నందున తమ తమ దేశాల్లో ఆయా ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఐక్యరాజ్యసమితి సూచిస్తోంది.

మరోవైపు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడిలో జరిగే మొదటి ప్రపంచ జనాభా సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.

---------------------------

రైతుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల

సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, రైతులు నష్ట పోకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోపే నగదు రైతుల ఖాతాల్లో జమజేశామని అన్నారు. తాజాగా ధాన్యం కొనుగోలు చేసిన 30 వేల మంది రైతులకు 650 కోట్ల రూపాయలను విడుదల చేశామని మంత్రి వివరించారు.

---------------------------

రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేసేలా పొగాకు సంస్థల ప్రతినిధులకు సూచించామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా జే.పంగులూరు పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోళ్ల వివరాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పొగాకుతో పాటు మామిడి, కోకో, పంటల విషయంలో ప్రభుత్వం రైతులకు మద్దతుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల అభ్యర్థన మేరకు... కొరిశపాడులో త్వరలోనే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

హైదరాబాద్ కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య 44కి చేరిందని, ఈ ఘటనలో ఇప్పటి వరకు నలుగురు ప్రాణాలు కోల్పోయారని తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నారని చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరో ఏడుగురికి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. కాగా ఈ నెల 8 వ తేదీన కూకట్‌పల్లి పరిధిలో పలువురు కల్తీకల్లు తాగి అస్వస్థతకు గురైయ్యారు.

---------------------------

ఆండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్ లోని లార్డ్స్ మైదానం వేదికగా భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య 3వ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ నిన్న ప్రారంభమైంది. మూడో టెస్టులో భాగంగా మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది.

ఇదిఇలా ఉండగా భారత క్రికెట్ క్రీడాకారులు సచిన్ టెండూల్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది.ఇంగ్లాండ్ లోని లార్డ్స్ మైదానంలోని మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ -ఎంసీసీ మ్యూజియంలో నిన్న ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో ఈ రోజు, రేపు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మీ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...32 సెకన్లు

=====================